సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శుక్రవారం । 27 । డిసెంబర్ । 2024



టన్ను చీనీ రూ.25,290
అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.25,290, కనిష్టం రూ.10 వేల ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



బాలికలు.. క్రీడల్లో మెరికలు
అమరాపురం బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల సంక్షేమ పాఠశాలలోని పలువురు విద్యార్థినులు క్రీడల్లో సత్తా చాటుతున్నారు. పతకాలతో దూసుకుపోతున్నారు. 10లో

గరిష్టం/కనిష్టం
27.1°/19.5°
జిల్లా పరిధిలో గురువారం తుపాను వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు, చలి తీవ్రత తగ్గింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి



మాట్లాడుతున్న డీఈఓ కృష్ణప్ప

నల్లచెరువు: ఏపీ మోడల్ స్కూళ్లలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని డీఈఓ కృష్ణప్ప పిలుపునిచ్చారు. గురువారం దేవిరెడ్డిపల్లి వద్దనున్న ఏపీ మోడల్ స్కూల్‌ను ఏజీసీడీఓ సంపూర్ణతో కలిసి డీఈఓ ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. పాఠశాల ఆవరణలో నెలకొన్న సమస్యలపై ప్రిన్సిపాల్ రాణాప్రతాప్ నాయక్‌తో చర్చించారు. ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని, లేదా ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మార్గదర్శనం చేశారు. ఎంఈఓ తిరుపాల్ నాయక్ పాల్గొన్నారు.

నేడు బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపిక

బత్తలపల్లి: బత్తలపల్లి ఆర్డీటీ క్రీడా మైదానంలో శుక్రవారం ఉమ్మడి అనంతపురం జిల్లా బాలబాలికల జూనియర్స్ కబడ్డీ జట్ల ఎంపిక నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్.రామ్‌తేజ్‌గౌడ్, ఉపాధ్యక్షుడు సంపత్‌కుమార్, కార్యదర్శి రాగిరి రామయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి మూడో తేదీ నుంచి ఐదో తేదీ వరకు కర్నూలు కేఈ ఫామ్ హౌస్‌లో 50వ మూలపురి రంగారావు మెమోరియల్ రాష్ట్రస్థాయి జూనియర్స్ బాలబాలికల కబడ్డీ చాంపియన్‌షిప్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అందులో పాల్గొనే జిల్లా జట్టుకు ఎంపిక ప్రక్రియ చేపడుతున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల క్రీడాకారులు ఇందులో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. బాలురు బరువు 70 కేజీలు, బాలికలు 65 కేజీలలోపు ఉండాలని, ఒరిజనల్ పదవ తరగతి మార్కుల జాబితా, ఆధార్‌కార్డు వెంట తీసుకురావాలని సూచించారు. ఎంపిక పోటీలు మ్యాట్‌పై నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. క్రీడాకారులు మ్యాట్ షూ ధరించాలని తెలిపారు.

వైవీఆర్ గేట్లు ఎత్తివేత



ముదిగుబ్బ: యోగి వేమన రిజర్వాయర్ (వైవీఆర్)కు ఉన్న రెండు గేట్లను గురువారం ఎత్తి నీటిని దిగువ ప్రాంతానికి వదిలినట్లు ఏఈ కృష్ణకుమార్ తెలిపారు. ఇటీవల కురిసిన వర్షానికి వైవీఆర్ పూర్తిగా నిండింది. డ్యాం సామర్థ్యం 0.84 టీఎంసీలు కాగా, 3,200 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. ఈ నీరు సీబీఆర్‌కు చేరుతుంది. గురువారం రాత్రి దొరిగిల్లు వద్ద ఉన్న పల్లపు వంతెనపై 4 అడుగుల ఎత్తున పారింది.

షాక్‌తో కకావికలం



- పుట్టపర్తిలోని ఉజ్వల ఫౌండేషన్‌లో ఓ నివాసం ముందు ప్రకటనల బోర్డు ఉంచారు. అయితే ఆ ఇంట్లో ఎలాంటి వ్యాపారమూ నిర్వహించలేదు. గమనించిన విద్యుత్ అధికారులు.. ఇంట్లో ఉన్నవారిని సంప్రదించకుండా కమర్షియల్ కింద బిల్లు జనరేట్ చేశారు. దీనిపై సదరు వినియోగదారుడు కార్యాలయంలో సంప్రదించాడు. అక్కడికి వచ్చి పరిశీలించి.. సమస్య పరిష్కరిస్తామని సమాధానం ఇచ్చారు.
- పుట్టపర్తిలోని గోవిందపేటలోని ఓ ఇంట్లో వివాహ వేడుక సందర్భంగా ఒక నెలలో అధిక కరెంటు వినియోగం జరిగింది. అయితే మరుసటి నెలకే విద్యుత్ సిబ్బంది వచ్చి అధిక లోడ్ కారణంగా మీటరు అమర్చుకోవాలని సూచించారు. అంతేకాకుండా రూ.8 వేల జరిమానా విధించారు. మొత్తం చెల్లించి.. మీటరు మార్చుకోవాలని హుకుం జారీ చేశారు. ఇల్లు పరిశీలించాలని వినియోగదారులు డిమాండ్ చేయడంతో.. ఆ తర్వాత సమస్య సద్దుమణిగింది. కానీ జరిమానా కింద రూ.4వేలు వసూలు చేశారు.
- పుట్టపర్తిలోని వెస్ట్ గేట్‌లో ఓ ఇంటి విద్యుత్ మీటరు పాడైపోయింది. నెల బిల్లు రూ.900 ఇచ్చారు. ఆ మరుసటి నెలలో కొత్త మీటరు అమర్చి.. తర్వాత రూ.2,600 బిల్లు ఇచ్చారు. ఇదేంటని కార్యాలయంలో అడగ్గా.. సగటు రీడింగు ప్రకారం బిల్లు ఆటోమేటిక్‌గా వస్తుందని అధికారులు సమాధానం ఇచ్చారు. ఏ లెక్కన సగటున తీసుకున్నా.. అంత బిల్లు ఎలా వస్తుందని అధికారులను వినియోగదారుడు ప్రశ్నించాడు. లిఖితపూర్వకంగా ఫిర్యాదు ఇస్తే.. తగ్గించే అవకాశం ఉందని అధికారులు చెప్పారు.

- పెరిగిన చార్జీలతో ప్రజల సతమతం
- నెలనెలా భరించలేని బిల్లుల భారం
- ఆర్నెల్లలోనే మొదలైన కరెంటు కష్టాలు
- నేడు ప్రజల తరఫున వైఎస్సార్‌సీపీ పోరుబాట

సాక్షి, పుట్టపర్తి: ఎన్నికల ప్రచారంలో భాగంగా అప్పట్లో ప్రతిపక్ష నేత హోదాలో చంద్రబాబు 'అధికారంలోకి వస్తే కరెంటు చార్జీలు పెంచను. మీ పొలంలో మీరే కరెంటు ఉత్పత్తి చేసుకుని వేరే వాళ్లకు అవసరమైతే ఇవ్వొచ్చు' అంటూ అలవిగాని హామీలు గుప్పించారు. కానీ పాలనా పగ్గాలు చేపట్టి ఆరు మాసాలు గడవకముందే కోలుకోలేని 'షాక్' ఇచ్చారు. సామాన్యుల నడ్డి విరుస్తూ కరెంటు చార్జీల భారం మోపారు. కూటమి సర్కారు నిర్ణయాలకు సామాన్యులే కాకుండా పారిశ్రామిక వేత్తలు, రైతులు కూడా విలవిలలాడి పోతున్నారు. బిల్లు కట్టడం నాలుగు రోజులు లేటైతే కరెంటు కనెక్షన్ తొలగిస్తుండటంతో బాధితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చుక్కలు చూపుతున్నారు..
గడిచిన ఐదేళ్లు కరెంటు కోతల్లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయగా.. నేడు కరెంటు పోళ్ల ఏర్పాటుకు కూడా దిక్కులేని పరిస్థితి నెలకొంది. అదనపు చార్జీల పేరిట సర్కారు భారం మోపుతోంది. ఒక గది ఉండే ఇళ్లు చాలా ఉన్నాయి. అయినా లోడ్ పెరిగిందంటూ నోటీసులేవీ ఇవ్వకుండా నేరుగా జరిమానా విధిస్తున్నారు. బిల్లు చెల్లింపు ఆలస్యమైతే మరింత భారం పడుతుందని హెచ్చరిస్తున్నారు. వినియోగదారులకు సమాధానం చెప్పకుండా.. కదిరి వెళ్లి డీఈని కలవాలని చెబుతున్నారు. అక్కడికి వెళ్లి వచ్చే ఖర్చులు భరించలేక.. మీటరు మార్చుకుంటున్నారు. ఫలితంగా ప్రతి నెలా అధిక భారంతో సతమతం అవుతున్నారు. మరోవైపు ఇంటి ముందు ఎలాంటి ప్రకటనలు కనిపించినా ఆ ఇంటి మీటరును కమర్షియల్ కేటగిరీలోకి మార్చేస్తున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి బయట ఉంటూ కరెంటు స్తంభాలకు అంటించే ప్రకటనలతో ఇంటి యజమానికి ఎలాంటి సంబంధం లేకున్నా.. లేనిపోని రాద్ధాంతం చేస్తున్నారు.

పోరుబాట షెడ్యూల్..		
నియోజకవర్గ కేంద్రం	సమయం	ఎక్కడి నుంచి
పుట్టపర్తి	ఉదయం 9.30 గంటలకు	గణేష్ సర్కిల్‌లోని వైఎస్సార్‌సీపీ
ధర్మవరం	ఉదయం 10 గంటలకు	కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి క్యాంప్ కార్యాలయం
కదిరి	ఉదయం 10 గంటలకు	వైఎస్సార్‌సీపీ కార్యాలయం
హిందూపురం	ఉదయం 9.30 గంటలకు	అంబేడ్కర్ సర్కిల్
పెనుకొండ	ఉదయం 10 గంటలకు	విద్యుత్ కార్యాలయం
మడకశిర	ఉదయం 10 గంటలకు	మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి ఇంటి నుంచి

నేడు వైఎస్సార్‌సీపీ పోరుబాట
కూటమి ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ భారం మోపడాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా 'పోరుబాట' పేరుతో నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చింది. శుక్రవారం జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ప్రజల తరఫున వైఎస్సార్‌సీపీ నేతల ఆధ్వర్యంలో ర్యాలీలు, ధర్నాలు, నిరసనలు, ఆందోళనలు చేయనున్నారు. అనంతరం విద్యుత్ కార్యాలయాలకు వెళ్లి.. వినతిపత్రాలు ఇవ్వనున్నారు.

గతమెంతో ఘనం..
గడిచిన ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో పెద్ద ఎత్తున సంస్కరణలు చేపట్టారు. కరెంటు కోతల్లేకుండా నాణ్యమైన విద్యుత్ పంపిణీ చేశారు. కొత్త లైన్లు, కొత్త సబ్‌స్టేషన్లు ఇలా ఒకటేమిటి రమారమి ఐదేళ్లలో రూ.వేల కోట్లు ఖర్చు చేసి ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకున్నారు. అయితే, కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితి పూర్తిగా తలకిందులైంది. కరెంటు పోళ్లకు కూడా దిక్కులేని పరిస్థితి. జిల్లావ్యాప్తంగా అవసరమైన పోట్ల పోళ్లు ఏర్పాటు చేయడానికి కూడా నిధులు లేని పరిస్థితి. ఇక కండక్టర్లు కూడా అందుబాటులో లేవు. విద్యుత్ కేబుల్ లేక పనులు స్తంభించిపోయాయి. వ్యవసాయ కనెక్షన్ల మంజూరులో తీవ్ర జాప్యం, ట్రాన్స్‌ఫార్మర్లు, కరెంటు పోళ్లు, కేబుల్, కండక్టర్లు అందించడంలో అంతులేని అలసత్వం వెరసి ఆరు మాసాల్లోనే విద్యుత్ వ్యవస్థను చిన్నాభిన్నం చేసిన పాపం కూటమి సర్కారుదేనని సామాన్యులు వాపోతున్నారు.

2019–2024 మధ్య కాలంలో విద్యుత్ సంస్కరణలు ఇలా..

కేటగిరీ	సంఖ్య	వ్యయం రూ.కోట్లలో
వ్యవసాయ కనెక్షన్లు	94,060	--
ట్రాన్స్‌ఫార్మర్లు	9612	270
సబ్‌స్టేషన్లు	46	161
పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు	114	53.76
33కేవీ ఫీడర్లు	11	40.26
11కేవీ ఫీడర్లు	19	13.93
33కేవీ లైను	42.4 కి.మీ	98.83
హౌసింగ్ కాలనీలు	349	88.32
11 కేవీ ఫీడర్లు	593	1334
33కేవీ కొత్త ఫీడర్లు	579.5 కిమీ	50.6
కొత్త సబ్‌స్టేషన్ల ప్రతిపాదన	273	955.5

స్వచ్ఛందంగా తరలిరండి



కరెంటు చార్జీలు పెంచేది లేదంటూ కూటమి నేతలు ఎన్నికల్లో చెప్పారు. ప్రభుత్వం ఏర్పాటయ్యాక విద్యుత్ చార్జీలను భారీగా పెంచారు. చార్జీల పెంపును వ్యతిరేకిస్తూ శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో 'పోరుబాట' చేపడుతున్నాం. పుట్టపర్తి, హిందూపురం, మడకశిర, పెనుకొండ, ధర్మవరం, కదిరిలో నిర్వహించే ర్యాలీ, అధికారులకు డిమాండ్లతో కూడిన వినతిపత్రం సమర్పించనున్నాం. పార్టీ శ్రేణులతో పాటు ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి జయప్రదం చేయాలి.
– ఉషశ్రీచరణ్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు

మేమొస్తున్నాం.. సర్దుకోండి!

- సాయంత్రం తీరిగ్గా వచ్చి తనిఖీలు

సాక్షి ఎఫెక్ట్..

చిలమత్తూరు: మండలంలోని పలు గ్రామాల్లో బెల్టుషాపుల ద్వారా దర్జాగా మద్యం విక్రయాలు చేస్తున్నా ఎక్సైజ్ అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడడం లేదు. అదనపు ధరతో మద్యం విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ వ్యవహారంపై 'పల్లెల్లో బెల్టు కిక్కు' శీర్షికన సాక్షిలో కథనం ప్రచురించింది. నిర్వాహకుల గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. అయితే అధికారులు మాత్రం తప్పదన్నట్టు గురువారం తనిఖీలకు ఉపక్రమించారు. తామొస్తున్నట్లు ముందుగానే సదరు బెల్టుషాపుల నిర్వాహకులకు సమాచారం అందజేసినట్లు తెలిసింది. 'సరుకు కనిపించకుండా సర్దుకోండి' అంటూ జాగ్రత్తలు చెప్పినట్లు సమాచారం. తాపీగా సాయంత్రం వెళ్లే సరికి అక్కడ మద్యం ఆనవాళ్లు లేకుండా చేశారు. ఎక్సైజ్ అధికారుల అండదండలతో బెల్టుషాపుల నిర్వాహకుల వ్యాపారం మూడు పువ్వులు– ఆరు కాయలుగా వర్ధిల్లుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

లేపాక్షి మండలంలోనూ..
లేపాక్షి మండలం కోడిపల్లి రోడ్డులో అనధికార బెల్టు షాపు ఏకంగా బార్ అండ్ రెస్టారెంట్‌ను తలపిస్తోంది. విద్యుత్ వెలుగు జిలుగుల నడుమ మద్యం విక్రయిస్తున్నారు. ఈ అక్రమ వ్యాపారం గురించి కూడా 'సాక్షి' పత్రికలో కథనం ప్రచురితమైంది. అయితే అధికారులు వెంటనే సదరు బెల్టుషాపు నిర్వాహకులకు ముందస్తు సమాచారం అందించి తనిఖీలకు వచ్చారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే నిర్వాహకులు చిక్కకుండా జాగ్రత్తపడ్డారు.

బాల్య వివాహాల నిర్మూలనకు పటిష్ట చర్యలు

ప్రశాంతి నిలయం: జిల్లాలో బాల్య వివాహాలు నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ పిలుపునిచ్చారు. గురువారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో బాల్య వివాహాల నిర్మూలనపై సమన్వయ సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రణాళికాబద్ధంగా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆర్డీఓలు, సీడీపీఓలు, అంగన్వాడీ కార్యకర్తలు, పోలీసులు, గ్రామాల్లో ఉన్న బాల్య వివాహాల నిరోధక కమిటీ సభ్యులు కీలక పాత్ర పోషించాలన్నారు. జిల్లాలో గత జనవరి నుంచి ఇప్పటి వరకు 105 బాల్య వివాహాలు నిలుపుదల చేసినట్లు చెప్పారు. ప్రతి నెలా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, బాల్య వివాహాలు, బాలికలపై జరుగుతున్న లైంగిక నేరాలు తదితర అంశాలపై అధికారులు సమీక్షా సమావేశాలు నిర్వహించి నిర్మూలనకు కృషి చేయాలన్నారు. ఎస్పీ వి.రత్న మాట్లాడుతూ చట్ట ప్రకారం 18 సంవత్సరాల వయస్సు నిండని అమ్మాయికి, 21 సంవత్సరాలు నిండని అబ్బాయికి వివాహం చేయడం నేరమన్నారు. కార్యక్రమంలో డీఆర్వో విజయ సారథి, ఐసీడీఎస్ పీడీ సుధా వరలక్ష్మి, ఆర్డీఓలు సువర్ణ, ఆనంద్, శర్మ, మహేష్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీపీఓ సమత తదితరులు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్, చిత్రంలో ఎస్పీ రత్న, వివిధ శాఖల అధికారులు

వయోవృద్ధుల సమస్యలు పరిష్కరించాలి..
సమాజంలో వివిధ కారణాల వల్ల సతమతమవుతున్న వయో వృద్ధుల సమస్యలను మానవతా దృక్పథంతో పరిష్కరించాలని కలెక్టర్ చేతన్ ఆదేశించారు. గురువారం మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో ఎస్పీ రత్న, డీఆర్వో విజయసారథి, విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ అధికారులతో కలసి వయోవృద్ధుల సంక్షేమం కోసం జిల్లా యంత్రాంగం చేపట్టవలసిన చర్యలపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ తల్లిదండ్రుల పోషణ, నిర్వహణ బాధ్యతలను పట్టించుకోని పిల్లలకు తగిన కౌన్సెలింగ్ ఇచ్చే విధంగా చర్యలు చేపట్టాలన్నారు.

అడవుల సంరక్షణకు కృషి..
జిల్లాలో అన్యాక్రాంతమైన అటవీ భూములను స్వాధీనం చేసుకుని, వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చేతన్ ఆదేశించారు. మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో అటవీ శాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అటవీ సంరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. అటవీ ప్రాంతంలో కొండలకు నిప్పు పెట్టకుండా గ్రామస్థాయిలో పర్యవేక్షణ చర్యలు తీసుకోవాలన్నారు.

మన్మోహనం.. మరువలేని జ్ఞాపకం



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న మన్మోహన్ సింగ్, దివంగత నేత వైఎస్సార్ (ఫైల్)



సత్యసాయి విద్యాసంస్థల 29వ స్నాతకోత్సవంలో బాబాతో మన్మోహన్ సింగ్ (ఫైల్)

- ఉమ్మడి జిల్లాతో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు ప్రత్యేక అనుబంధం
- ఇక్కడి నుంచే జాతీయ ఉపాధి హామీ పథకం ప్రారంభం

శింగనమల/ ప్రశాంతి నిలయం: మాజీ ప్రధాని, ఆర్థికవేత్త డాక్టర్ మన్మోహన్ సింగ్ మరణవార్త విన్న జిల్లావాసులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. మన్మోహన్‌తో ఉమ్మడి జిల్లాకు గల అనుబంధాన్ని గుర్తు చేసుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వలసలు నివారించేందుకు 2006లో అప్పటి యూపీఏ ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని (ఎన్ఆర్ఈజీఎస్) తీసుకువచ్చింది. అదే ఏడాది ఫిబ్రవరి 2వ తేదీన ఈ పథకాన్ని అనంతపురం జిల్లా నార్పల మండలం బండ్లపల్లి నుంచే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రధాని హోదాలో మన్మోహన్‌సింగ్, యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ, అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి బండ్లపల్లికి వచ్చారు. ఆ సందర్భంగా ప్రధాని మన్మోహన్‌సింగ్ కూలీలతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా రాగి సంకటి ఆరగించి సంతృప్తి వ్యక్తం చేశారు.



సత్యసాయి పార్థివ దేహం వద్ద విషణ్ణవదనంతో మన్మోహన్‌సింగ్ (ఫైల్)

సత్యసాయి ప్రియ భక్తుడు
సత్యసాయి అంటే డాక్టర్ మన్మోహన్‌సింగ్‌కు అమితమైన ఇష్టం. సత్యసాయిపై ఉన్న భక్తిభావనతో పలుమార్లు పుట్టపర్తిని సందర్శించారు. దేశ ఆర్థిక మంత్రిగా ఉన్నపుడు 1995 నవంబర్ 22న ప్రశాంతి నిలయంలో నిర్వహించిన సత్యసాయి విద్యాసంస్థల 14వ స్నాతకోత్సవ వేడుకలకు హాజరయ్యారు. ప్రధాని హోదాలో 2010 నవంబర్ 22న 29వ స్నాతకోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై సందేశాన్నిచ్చారు. సత్యసాయి నిర్యాణం చెందడంతో ప్రధాని హోదాలో 2011 ఏప్రిల్ 26న ప్రశాంతి నిలయం చేరుకుని పార్థివ దేహానికి నివాళులర్పించారు. చివరగా 2016లో ప్రశాంతినిలయం సందర్శించారు. మన్మోహన్‌సింగ్ మరణం బాబా భక్తులను సైతం కలచివేసింది.



విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా గోరంట్లలో వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి లాంతర్లతో ప్రదర్శన నిర్వహిస్తున్న జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్

కరెంటు చార్జీలు తగ్గించండి

గోరంట్ల: కూటమి ప్రభుత్వం ప్రజలపై మోపిన విద్యుత్ చార్జీల భారాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ శుక్రవారం పోరుబాటకు పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా ఒక్కరోజు ముందుగానే గురువారం రాత్రి గోరంట్లలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ ఆధ్వర్యంలో లాంతర్ల ప్రదర్శన నిర్వహించారు. వాసవీ మహల్ ఫంక్షన్ హాలు నుంచి వైఎస్సార్‌సీపీ కార్యాలయం వరకు ప్రదర్శన సాగింది. విద్యుత్ చార్జీలు పెంచబోమని ఎన్నికల్లో ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చాక తుంగలో తొక్కారని చంద్రబాబుపై మండిపడ్డారు. విద్యుత్ చార్జీలు చెల్లించలేక పేదలు చీకటిలో మగ్గాల్సి వస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ వినియోగదరులపై మోపిన రూ.15,485.36 కోట్ల భారాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వీరనారాయణరెడ్డి, పట్టణ కన్వీనర్ మేదర శంకర, జెడ్పీటీసీ సభ్యుడు పాలే జయరాంనాయక్, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ మాజీ చైర్మన్ పొగాకు రామచంద్ర, మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పాలసముద్రం ఫక్రుద్దీన్ సాహెబ్, జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు రమాకాంత్‌రెడ్డి, పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు రాజారెడ్డి, సోమందేపల్లి జెడ్పీటీసీ అశోక్, జిల్లా స్టీరింగ్ కమిటీ మాజీ సభ్యులు గంపల వెంకటరమణారెడ్డి, బూదిలి సహకార సంఘం అధ్యక్షుడు రఘురామిరెడ్డి, ముఖ్యనాయకులు బాలన్నగారిపల్లి కృష్టారెడ్డి, బూదిలి శ్రీనివాసరెడ్డి, వానవోలు రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కరెంటు చార్జీలను తగ్గించాలని నినదిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

క్లుప్తంగా

డ్రగ్స్, ర్యాగింగ్‌కు దూరంగా ఉండండి



డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

రొద్దం: మాదక ద్రవ్యాలు, ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని రొద్దంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు సూచించారు. యాంటీ డ్రగ్స్, యాంటీ ర్యాగింగ్‌పై గురువారం విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించారు. డ్రగ్స్ వాడకం వల్ల సమాజంలో ఎదుర్కొవాల్సిన దుష్పరిణామాలు, అనారోగ్య సమస్యలపై చైతన్య పరిచారు. సరదాగా మొదలుపెట్టినా... అనంతరం వ్యసనంగా మారి భవిష్యత్తును నాశనం చేస్తుందన్నారు. మంచి ఆలోచనలు కలిగి ఉండాలని, సమాజాభివృద్ధి, దేశాభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. పరిసర ప్రాంతాల్లో ఎవరైనా డ్రగ్స్ వినియోగిస్తున్నట్లు అనుమానం వచ్చినా, విక్రయిస్తున్నట్లు తెలిసినా వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరంగా విధించే శిక్షలను వివరించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. అంతరం పోలీస్ స్టేషన్‌కు చేరుకుని పలు రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వెంట ఎస్ఐ నరేంద్ర, సిబ్బంది ఉన్నారు.

కల్లు దుకాణానికి నిప్పు



దగ్ధమైన దుకాణాన్ని చూపుతున్న బాధితుడు

రొద్దం: స్థానిక కందుకూర్లపల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఉన్న కల్లు దుకాణానికి బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుటించారు. ఘటనతో రూ.10 వేలు విలువ చేసే సామగ్రి కాలిపోయినట్లు నిర్వాహకుడు శ్రీనివాసులు వివరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు.

వ్యక్తి ఆత్మహత్య

నల్లచెరువు: మండలంలోని కె.పూలకుంట గ్రామానికి చెందిన హరి(35) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... ఐచర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న హరి కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో కుటుంబంలో మనస్పర్థలు చెలరేగడంతో భార్య స్వాతి గొడవ పడి కొన్ని రోజుల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెందిన హరి బుధవారం అర్ధరాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం ఉదయం విషయాన్ని గుర్తించిన మృతుడి తండ్రి రామప్ప ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బాలికలు.. క్రీడల్లో మెరికలు

వారంతా గ్రామీణ ప్రాంతానికి చెందిన బాలికలు. సాంఘిక సంక్షేమ గురుకులంలో చదువుకుంటున్నారు. శారీరక దారుఢ్యంతో పాటు మానసికోల్లాసాన్ని కలిగించే క్రీడలపై విద్యార్థినులు ఆసక్తి చూపారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో తమ ప్రతిభను కనబరుస్తూ ఎన్నో పతకాలను సాధిస్తున్నారు.

- రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణిస్తున్న అంబేడ్కర్ గురుకుల పాఠశాల బాలికలు
- నిరంతర సాధనతో వరుస విజయాలు



పాఠశాల ఆవరణలో ఖోఖో సాధన చేస్తున్న దృశ్యం



జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో పాల్గొనేందుకు కోల్‌కత్తాకు వెళ్లిన విద్యార్థులు (ఫైల్)

అమరాపురం: మండలంలోని హలుకూరు గ్రామ సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల సంక్షేమ పాఠశాలలో చదువుతున్న బాలికలు ఆంధ్రప్రదేశ్ స్కూల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో పాల్గొని సత్తా చాటారు. జోనల్ స్థాయి నుంచి మొదలైన విజయ ప్రస్థానం జాతీయ పోటీల వరకూ కొనసాగించడం గమనార్హం.

ధ్యానంతో మొదలు..

హలుకూరు గురుకుల బాలికల సంక్షేమ పాఠశాలలో మడకశిర, కళ్యాణదుర్గం, రాయదుర్గం, హిందూపురం తదితర ప్రాంతాల విద్యార్థినులు చదువుకుంటున్నారు. విద్యార్థినుల తల్లిదండ్రులు, ప్రిన్సిపాల్ పద్మావతి ప్రోత్సాహంతో క్రీడాభివృద్ధికి పీడీ రోజా, పీఈటీ భాగ్యమ్మ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఈ క్రమంలో రోజూ ఉదయం ధ్యాన ప్రక్రియతో మొదలైన విద్యార్థినుల దినచర్య... ఆ తర్వాత 6 నుంచి 7.30 గంటల వరకూ ఎంపిక చేసిన విద్యార్థినులతో ఖోఖో, షూటింగ్ బాల్, వాలీ బాల్, డిస్కస్ త్రో, షాట్‌పుట్ తదితర క్రీడల సాధన చేపడతారు. సాయంకాలం పాఠశాల వేళలు ముగిసిన తరువాత గంట సేపు వివిధ క్రీడల్లో శిక్షణ ఇస్తుంటారు. గత నెల ఏలూరు జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాఠశాల విద్యార్థి వరలక్ష్మి ఆధ్వర్యంలోని జట్టు ఖోఖోలో ప్రథమ విజేతగా నిలిచింది. నెల్లూరు జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ విభాగంలో విద్యార్థులు పూజ, పావని ప్రథమ స్థానంలో నిలిచారు. వీరు ఈ నెల 23న కోల్‌కత్తాలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. అలాగే డిస్కస్‌త్రో లో విద్యార్థిని స్వప్న ప్రథమ స్థానంలో విజేతగా నిలిచింది. క్రీడలతో పాటు చదువులోనూ రాణిస్తున్నారు.

ఆత్మవిశ్వాసంతో ముందుకు



నేను, నా స్నేహితురాలు పావని గత నెలలో జరిగిన రాష్ట్ర స్థాయి షూటింగ్ పోటీలో ప్రథమ స్థానంలో నిలిచాం. ఈ నెల 23న కోల్‌కత్తాలో జరిగే పోటీల్లో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు వెళ్లాం. ప్రిన్సిపాల్, పీడీ, పీఈటీల ప్రోత్సాహంతోనే ఇది సాధ్యమైంది. ఇదే ఆత్మవిశ్వాసంతో మున్ముందు క్రీడల్లో రాణించి పాఠశాలతో పాటు మా గ్రామానికి గుర్తింపు తీసుకువస్తా.

– పూజ, విద్యార్థి, అమరాపురం

సాధనతోనే సాధ్యం



నిరంతర సాధన చేస్తే ఏ రంగంలోనైనా సులువుగా విజయం సాధించవచ్చు. మాది పేద కుటుంబం. అనంతపురం జిల్లా శెట్టూరు మండలం ఎర్రబోరేపల్లి గ్రామం. ప్రస్తుతం నేను పదో తరగతి చదువుతున్నా. చిన్నప్పటి నుంచి ఖోఖో ఆడడమంటే చాలా ఇష్టం. ఈ పాఠశాలకు వచ్చిన తర్వాత నన్ను మంచి క్రీడాకారిణిగా పీడీ, పీఈటీలు తీర్చిదిద్దారు. నా కెప్టెన్సీలోని జట్టు రాష్ట్ర స్థాయిలో ప్రథమ విజేతగా నిలవడం ఎంతో గర్వంగా ఉంది.

– వరలక్ష్మి, పదో తరగతి విద్యార్థి

పోలీసునవుతా



మాది చాలా పెద్ద కుటుంబం. మేము ఐదుగురము అక్కాచెల్లెళ్లము ఉన్నాం. మా కోసం అమ్మ, నాన్న పడుతున్న కష్టం మాటల్లో చెప్పలేను. దీంతో పట్టుదలతో హలుకూరులోని బాలికల గురుకుల పాఠశాలలో చేరి చదువుకుంటున్నా. డిస్కస్ త్రో అంటే నాకు చాలా ఇష్టం. గత నెలలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలో బంగారు పతకాన్ని సాధించా. క్రీడల్లో రాణించి స్పోర్ట్స్ కోటాలో పోలీసు ఉద్యోగం సాధించాలని ఉంది.

– స్వప్న, 9వ తరగతి

మెరికల్లా రాణిస్తున్నారు



మా పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు చదువుతో పాటు క్రీడల్లోనూ మంచి శిక్షణ ఇస్తున్నాం. శిక్షణ సమయంలో మంచి ప్రతిభ కనబరచిన విద్యార్థులను గుర్తించి వారికి ఇష్టమున్న క్రీడల్లో రాణించేలా ప్రత్యేక చొరవ తీసుకుంటున్నాం. ఈ విషయంగా పీఈటీ భాగ్యమ్మ సహకారం మరువలేనిది. మా పాఠశాల విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తుండడం ఎంతో గర్వంగా ఉంది.

– రోజా, పీడీ

అపరిమిత వైద్య సౌకర్యాలు కల్పించాలి



మాట్లాడుతున్న చెన్నారెడ్డి

పుట్టపర్తి టౌన్: ప్రభుత్వంలోకి ఆర్టీసీ విలీనం కాక ముందు కార్మికులకు అందిన విధంగానే అపరిమిత వైద్య సౌకర్యాలు కల్పించాలని కూటమి ప్రభుత్వాన్ని ఎన్ఎంయూఏ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, కడప జోనల్ కార్యదర్శి చెన్నారెడ్డి డిమాండ్ చేశారు. పుట్టపర్తిలో సాయిఆరామంలో కడప జోనల్ జాయింట్ సెక్రటరీ శ్రీరామ్‌నాయక్ అధ్యక్షతన ఎన్ఎంయూఏ సర్వసభ్య సమావేశం గురువారం జరిగింది. కార్యక్రమానికి నాగరాజు, చెన్నారెడ్డితో పాటు జిల్లా రీజనల్ ఉపాధ్యక్షుడు కేశప్ప, ఉపాధ్యక్షురాలు తిరుపతమ్మ, జిల్లా కార్యదర్శి షబ్బీర్ ముఖ్యఅథితులుగా హాజరై, మాట్లాడారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. కొత్త బస్సులు కొనుగోలు చేయాలని, మారిన సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా అన్ని గ్యారేజీల్లోనూ యంత్ర పరికరాలను సమకూర్చాలన్నారు. అన్ని కేటగిరీల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పుట్టపర్తి డిపో నూతన కమిటీని ఎన్నుకున్నారు. రీజనల్ ఉపాధ్యక్షుడిగా రవితేజ, ఉపాధ్యక్షురాలిగా తిరుపతమ్మ, ట్రెజరర్‌గా చంద్రాయుడును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మామిడిలో సస్యరక్షణ చర్యలు చేపట్టండి

- ఉద్యానశాఖ డీడీ బీఎంవీ నరసింహారావు



ఆత్మకూరులో మామిడి రైతులకు సూచనలిస్తున్న నరసింహారావు

అనంతపురం అగ్రికల్చర్: వరుస తుఫాన్లు, మారిన వాతావరణ పరిస్థితుల కారణంగా మామిడి తోటల్లో మేలైన యాజమాన్య పద్ధతులు, సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రైతులకు ఉద్యానశాఖ డీడీ బీఎంవీ నరసింహారావు సూచించారు. ఆత్మకూరు, గార్లదిన్నె మండలాల్లో రైతుల మామిడి తోటలను హెచ్ఓ రత్నకుమార్‌తో కలసి గురువారం ఆయన పరిశీలించారు. ప్రస్తుతం మామిడి తోటలు పూమొగ్గ, పచ్చిపూత, పూత దశ లాంటి కీలకదశలో ఉన్నాయన్నారు. మంచి దిగుబడుల కోసం సరైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 10 వేల హెక్టార్లలో మామిడి తోటలు ఉన్నాయన్నారు. తుఫాన్ల వల్ల చిరుజల్లులు, ఉష్ణోగ్రతలు తగ్గడం, మబ్బులు, ముసురు లాంటి వాతావరణ పరిస్థితులు నెలకొంటున్నాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రసంపీల్చు పురుగు ఉధృతి పెరిగే అవకాశముందన్నారు. పూమొగ్గ దశలో ఉన్న తోటల్లో తేనెమంచు పురుగు, పక్షికన్ను తెగులు, బూడిద తెగులు నివారణకు లీటర్ నీటికి 0.3 మి.లీ ఇమిడాక్లోప్రిడ్ + 2 మి.లీ క్లోరోథలోనిల్ కలిపి పిచికారీ చేయాలన్నారు. పచ్చిపూత దశ ఉన్న తోటల్లో లీటర్ నీటికి 0.3 గ్రాములు థయామిథాక్సామ్ లేదా 1.5 మి.లీ బుప్రోఫెజిన్ + 2 మి.లీ హెక్సాకోనజోల్ లేదా 2 గ్రాములు మాంకోజెబ్, కార్బండిజమ్ కలిపి పిచికారీ చేస్తే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. తోటలకు నీరు తక్కువగా పెట్టడంతో పాటు శుభ్రంగా ఉంచుకుంటే తెగుళ్ల ఉధృతి తగ్గుతుందని తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

30 నుంచి దేహదారుఢ్య పరీక్షలు

- జనవరి 17 వరకూ ప్రక్రియ

అనంతపురం: స్థానిక నీలం సంజీవరెడ్డి స్టేడియంలో ఈ నెల 30 నుంచి పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించనున్నారు. జనవరి 17వరకూ ప్రక్రియ సాగనుంది. పురుష అభ్యర్థులు 5,242, మహిళా అభ్యర్థులు 1,237 మంది మొత్తం 6,749 మంది హాజరుకానున్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఒక సెట్ జిరాక్స్ కాపీలను అభ్యర్థులు తమ వెంట తీసుకురావాల్సి ఉంటుంది.

పకడ్బందీగా ప్రక్రియ..

దేహదారుఢ్య పరీక్షల నిర్వహణపై పోలీసు అధికారులు, ఐటీ కోర్ టీంతో ఎస్పీ పి. జగదీష్ గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఏపీ స్టేట్ లెవల్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ఏపీఎస్ఎల్ఆర్‌బీ) ఆదేశాలు, నియమ నిబంధనల మేరకు పరీక్షలు సవ్యంగా జరిగేలా ప్రణాళి సిద్ధం చేశామన్నారు. పొరపాట్లకు తావు లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సర్టిఫికెషన్ వెరిఫికేషన్ నుంచి బయోమెట్రిక్ అథెంటిఫికేషన్, ఫిజికల్ మెజర్మెంట్ పరీక్షలు, ఆర్ఎఫ్ఐడీ ట్యాగుల పంపిణీ, ఫిజికల్ ఎఫిషియన్సీ పరీక్షలు (1600 మీటర్లు, 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్), వెరిఫికేషన్స్ 2 (స్పెషల్ బెనిఫిట్స్, లోకల్ స్టేటస్), రిజల్ట్ కౌంటర్ వరకు అంచెలంచెలుగా సమగ్రంగా విధులు నిర్వర్తించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఇలియాజ్ బాషా, డీఎస్పీలు శ్రీనివాసరావు, వెంకటేశ్, రవిబాబు, శ్రీనివాస్, రామకృష్ణుడు, నీలకంఠేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువతి మృతి

తనకల్లు: పెళ్లి ఇష్టం లేక ఆత్మహత్యాయత్నం చేసి, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తనకల్లు మండలం బండకాడపల్లికి చెందిన శ్రావణి (22) గురువారం మృతి చెందింది. ఈ మేరకు ఎస్ఐ గోపి తెలిపారు. రాసినేని సత్యనారాయణ కుమార్తె శ్రావణి బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసింది. ఈ క్రమంలో ఆమెకు తల్లిదండ్రులు పెళ్లి ప్రయత్నాలు మొదలు పెట్టారు. అయితే తనకు ఇప్పుడే పెళ్లి వద్దని ఆమె తెలపడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన ఆమె ఈ నెల 23న ఇంట్లో ఉన్న క్రిమిసంహారక మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు ఆమెను వెంటనే బత్తలపల్లిలోని ఆర్డీటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక మూడు రోజుల తర్వాత గురువారం ఆమె మృతి చెందింది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

నమో నారసింహ..



దీపాలు వెలిగిస్తున్న మహిళలు

కదిరి టౌన్: ప్రముఖ పుణ్యక్షేత్రం ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం గురువారం భక్తులతో పోటెత్తింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఓం నమో నారసింహ నామస్మరణతో ఆలయం మార్మోగింది. తలనీలాలు సమర్పించి, మహిళలు దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి, అన్నదానం నిర్వహించారు.

అంతర్రాష్ట్ర ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్

- రూ.7 లక్షల విలువ చేసే 12 ద్విచక్ర వాహనాల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలను చూపుతున్న పోలీసులు

బొమ్మనహాళ్: ద్విచక్ర వాహనాలను అపహరించుకెళుతున్న అంతర్రాష్ట్ర దొంగను పోలీసులు అరెస్ట్ చేసి రూ.7 లక్షలు విలువ చేసే 12 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. గురువారం సాయంత్రం బొమ్మనహాళ్ పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను డీఎస్పీ రవిబాబు వెల్లడించారు. రాయదుర్గం, బొమ్మనహాళ్ మండలం ఉంతకల్లు, నేమకల్లు, ఉద్దేహాళ్, కణేకల్లు క్రాస్, బళ్లారి పట్టణంలోని వివిధ దుకాణాలు, దేవాలయాల ఎదుట నిలిపిన ఖరీదైన ద్విచక్ర వాహనాలు గత కొన్ని రోజుల్లో చోరీకి గురయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసిన పోలీసులు బృందాలుగా విడిపోయి దర్యాప్తు వేగవంతం చేశారు. ఈ క్రమంలో శెట్టూరు మండలం అడవిగొల్లపల్లి గ్రామానికి చెందిన వడ్డే సురేష్ (పాత నేరస్తుడు) గురువారం బొమ్మనహాళ్ మండలం మీదుగా బళ్లారికి వెళుతున్నట్లు సమాచారం అందుకున్న ఎస్ఐ నబీ రసూల్ అప్రమత్తమై తన సిబ్బందితో నేమకల్లు క్రాస్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా ద్విచక్ర వాహనంపై వచ్చిన సురేష్‌ను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేపట్టడంతో ద్విచక్ర వాహనాల వరుస చోరీలు వెలుగు చూశాయి. దీంతో నిందితుడు దాచి ఉంచిన 12 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కాగా, సురేష్‌పై గతంలో బొమ్మనహాళ్ పీఎస్‌లో 3 కేసులు, కణేకల్లు పీఎస్‌లో 1, రాయదుర్గం పీఎస్‌లో 1, బళ్లారి పట్టణంలోని కౌలు బజారు పోలీస్‌స్టేషన్‌లో ఒకటితో పాటు అదే రాష్ట్రంలోని పలు పీఎస్‌ల పరిధిలో చాలా కేసులున్నాయి. కార్యక్రమంలో సీఐలు వెంకటరమణ, జయ నాయక్, బొమ్మనహాళ్ ఎస్ఐ నబీరసూల్ తదితరులు పాల్గొన్నారు.

గోడౌన్ల నిర్మాణాలు పూర్తి చేయండి

- మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ విజయసునీత



రాప్తాడు మండలం మరూరు గోడౌన్‌ను పరిశీలిస్తున్న డైరెక్టర్ విజయసునీత

అనంతపురం అగ్రికల్చర్: మార్కెటింగ్ శాఖ, సహకారశాఖ సంయుక్తంగా చేపట్టిన మల్టీ పర్పస్ ఎక్స్‌టెన్షన్ గోడౌన్ల నిర్మాణాలు టార్గెట్ మేరకు పూర్తి చేసి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్)కు అప్పగించాలని మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ విజయసునీత మార్కెటింగ్‌శాఖ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లాకు విచ్చేసిన డైరెక్టర్ రెండు జిల్లాల పరిధిలో చేపట్టిన గోడౌన్ల గురించి తెలుసుకున్నారు. అనంతపురం జిల్లాలో 101 గోడౌన్లకు గానూ 53 పూర్తి చేసి 46 సంబంధించిన పీఏసీఎస్‌కు అప్పగించినట్లు తెలిపారు. అలాగే శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలో 87 గోడౌన్లకు గానూ 60 పూర్తి చేసి అందులో 50 గోడౌన్లకు పీఏసీఎస్‌లకు అప్పగించినట్లు డీఈ రఘునాథ పేర్కొన్నారు. ఒక్కో గోదాము నిర్మాణానికి రూ.40 లక్షలు వెచ్చించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ విజయసునీత మాట్లాడుతూ మిగిలిన గోడౌన్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. విస్తృతంగా ప్రచారం చేసి రైతులు ఉపయోగించుకునేలా చూడాలన్నారు. సొసైటీలు ఆర్థికంగా బలోపేతం కావడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్కడా వృథాగా ఉండకుండా వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులు లేదా ఇతరత్రా అద్దె ప్రాతిపదికన ఇచ్చేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. అనంతరం పాలసముద్రం, మరూరు, ఏ.నారాయణపురంలో నిర్మించిన గోదాములను పరిశీలించారు. కార్యక్రమంలో మార్కెటింగ్‌శాఖ ఆర్జేడీ సి.రామాంజినేయులు, డీడీ శ్రీకాంత్‌రెడ్డి, ఏడీఎంలు పి.సత్యనారాయణచౌదరి, ఎల్ఎస్ మూర్తి, పీఏసీఎస్ సీఈవోలు పాల్గొన్నారు.

బీసీసీఐ అండర్-23 ఏపీ జట్టులో చోటు



మహేంద్ర రెడ్డి



బొమ్మన్న

అనంతపురం: బీసీసీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్–23 అంతర్రాష్ట్ర వన్ డే క్రికెట్ టోర్నీలో ప్రాతినిధ్యం వహిస్తున్న ఏపీ జట్టులో జిల్లాకు చెందిన ఇద్దరికి చోటు దక్కింది. తాడిపత్రికి చెందిన కుడిచేతి మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్ టి.మహేంద్రరెడ్డితో పాటు అండర్ –23 ఆంధ్రా ఉమెన్ జట్టుకు ఫిట్నెస్ ట్రైనర్‌గా బి.బొమ్మన్న ఎంపికయ్యారు. జార్ఖండ్ రాజధాని రాంచీలో పురుషుల, జనవరి 4 నుంచి 12వ తేదీ వరకు రాజకోట్‌లో మహిళల క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నారు. జట్టులో చోటు దక్కించుకున్న వారిని ఏడీసీఏ సెక్రెటరీ వి.భీమలింగారెడ్డి అభినందించారు.

ఫారిన్ లాంగ్వేజెస్‌పై ఆన్‌లైన్ కోర్సు ప్రారంభం



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎస్కేయూ ఇన్‌చార్జి వీసీ అనిత గౌడ్

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వేదికగా ఆర్డీటీ ప్రొఫెషనల్ స్కూల్ ఆధ్వర్యంలో ఫారిన్ లాంగ్వేజెస్‌పై ఆన్‌లైన్ కోర్సును గురువారం ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ డాక్టర్ బొమ్మగాని అనిత గౌడ్ ప్రారంభించారు. స్పానిష్, జర్మన్, పోర్చుగీసు, ఫ్రెంచ్ బాషలపై ఆసక్తి చూపిన 150 మంది విద్యార్థులకు అడ్మిషన్ కల్పించారు. ఆన్‌లైన్ కోర్సులకు సంబంధించి ల్యాప్‌టాప్, శిక్షణను ఆర్డీటీ సంస్థ ఉచితంగా అందజేస్తోంది. కోర్సు పూర్తి చేసిన వారికి పరీక్షలు నిర్వహించి ఉత్తీర్ణులైన వారికి పీజీ డిప్లొమా సర్టిఫికెట్‌ను ఎస్కేయూ అందజేస్తుంది. కార్యక్రమంలో ఎస్కేయూ స్కిల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్.నాగభూషణరాజు, ఆర్డీటీ సిబ్బంది పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



బాధితుడి నుంచి వివరాలు సేకరిస్తున్న సీఐ రాఘవన్

పెనుకొండ రూరల్: మండలంలోని గుట్టూరులో తాళం వేసిన ఇంటిలో చోరీ జరిగింది. వివరాలు... గ్రామానికి చెందిన కురుబ పోతన్నకు ఒకే కాంపౌండ్‌లో రెండు ఇళ్లు ఉన్నాయి. ఈ క్రమంలో ఓ ఇంటిని స్టోర్ రూంగా మార్చి మరో ఇంట్లో కుటుంబసభ్యులతో కలసి జీవనం సాగిస్తున్నాడు. బుధవారం రాత్రి స్టోర్ రూంగా ఉన్న ఇంటికి తాళం వేసి మరో ఇంట్లో నిద్రించిన పోతన్న కుటుంబసభ్యులు గురువారం ఉదయం నిద్ర లేచేసరికి స్టోర్‌రూం తలుపులు తీసి ఉండడం గమనించి లోపలకు వెళ్లి పరిశీలించారు. బీరువాలోని దుస్తులు చిందరవందర చేసిన దుండగులు 6 తులాల బంగారు నగలు, 4 తులాల వెండి సామగ్రిని అపహరించుకెళ్లినట్లుగా గుర్తించారు. విషయ తెలుసుకున్న సీఐ రాఘవన్, క్లూస్ టీం సభ్యులు అక్కడకు వెళ్లి పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు కియా పోలీసులు తెలిపారు.

ఇద్దరు విద్యార్థుల డీబార్

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్ ఇంజినీరింగ్, కెమిస్ట్రీ, ఫార్మసీ విభాగాల్లో నిర్వహిస్తున్న ఎల్ఎల్‌బీ రెండో సెమిస్టర్ పరీక్షల్లో మాస్‌కాపీయింగ్‌కు పాల్పడుతూ ఇద్దరు విద్యార్థులు పట్టుబడ్డారు. వారిని డీబార్ చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు. కాగా, పరీక్ష కేంద్రాలను కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ సి. లోకేశ్వర్లు తనిఖీ చేశారు. కట్టుదిట్టంగా పరీక్షలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

మన్మోహన్ సింగ్ మృతికి అనంత సంతాపం

అనంతపురం కార్పొరేషన్: మాజీ ప్రధాని మన్మోహన్ మృతికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ గురువారం రాత్రి ఓ ప్రకటన విడుదల చేశారు. తాను ఎంపీగా ఉన్న సమయంలో మన్మోహన్ సింగ్‌తో ఉన్న సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు. భారతదేశానికి 14వ ప్రధానమంత్రిగా ఆయన అందించిన సేవలను కొనియాడారు. 2004 నుంచి 2014 వరకు ప్రధానిగా పనిచేసిన ఆయన అంతకుముందు కేంద్ర ఆర్థిక మంత్రి , ఆర్థిక కార్యదర్శిగానూ పని చేశారన్నారు. పీవీ నరసింహారావు ప్రభుత్వంలో ఆర్థిక వ్యవస్థను సరళీకృతం చేయడంలో మన్మోహన్ సింగ్ ముఖ్యమైన పాత్ర పోషించారన్నారు. తన పదవీ కాలమంతా సభకు హాజరు కావడం ఆయన అంకిత భావానికి నిదర్శనమన్నారు. ఆరోగ్యం సహకరించకున్నా వీల్ చైర్‌లో పార్లమెంట్ సమావేశాలకు హాజరయ్యేవారన్నారు. దేశంలో ఆర్థిక సంస్కరణల రూపశిల్పిగా గుర్తింపు పొందారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు ఉపాధి హామీ కల్పించే చట్టం చేయాలని సుదీర్ఘకాలం పాటు కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తూ వచ్చాయని, ఇది మన్మోహన్ సింగ్ నాయకత్వంలో సాకారమైందన్నారు. దేశంలోనే తొలిసారిగా ఉపాధి హామీ పథకాన్ని అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గం పరిధిలోని బండ్లపల్లిలో ప్రారంభించారని గుర్తు చేశారు.